# విలువైనది

ఆ ఇంటి యజమాని చనిపోయి పదిహేనురోజులైంది. పల్లెటూరు కావడంతో బంధువులు ఎక్కువ రాలేదు. ఊర్లో వాళ్లే ఒక్కొక్కరు వచ్చి పరామర్శించి వెళ్లారు. మొదటి గదిలో ఓ మూల పెట్టిన ఆయన ఫోటో తీసి గోడకు తగిలించాడు ఆయన చిన్న కొడుకు రాఘవ. దీపారాధన చేసిన ప్రమిదను మిగిలిపోయిన నూనెను ఆ ఇంటి పనిమనిషికి ఇచ్చేశాడు. ఆయన తాలూకు జ్ఞాపకం, బాధ ఆ ఇంటివాళ్లని అప్పుడప్పుడే వదిలి వెళ్తున్నది.

''అన్నయ్యా! రేపు నేనూ విమల వెళ్లిపోదామనుకుంటున్నాం. లీవ్ అయిపోయిందికదా!'' అన్నాడు ఆ ఇంటి రెండో కొడుకు పరమేశ్వర్.

ఉండమని చెప్పాలని వున్నా వెళ్లొద్దని అనలేదు విద్యాధర్.

''మేం కూడా వెళ్లిపోతాం అన్నయ్య. ఇంకా ఎందుకిక్కడ?'' రాఘవ అన్నాడు తండ్రి పటానికి దండ వేస్తూ.

విద్యాధర్ తలెత్తి చూసాడు. 'నువ్వు కూడానా' అన్నట్టు, చిన్నగా ''ఊ'' అన్నాడు. పరమేశ్వర్ వచ్చి తన అన్నయ్య దగ్గరగా కూర్చున్నాడు. రాఘవ, అతని భార్య సరళ కూడా అతని దగ్గరకు వచ్చారు.

''అన్నయ్యా! ఇక ఈ ఆస్తి సంగతి తేల్చేద్దాం. ముగ్గురం మూడుచోట్ల వున్నాం. ఈ ఊర్లో ఇంకా ఎందుకు?'' అన్నాడు.

''అవును బావగారు. మూడు భాగాలు చేసుకుని పంచేసుకుంటే సరిపోతుంది. మళ్లీ మళ్లీ ఇక్కడికి రావడం ఏం కుదురుతుంది చెప్పండి'' సరళ అన్నది.




''ఈ పనంతా అయిపోతే ముగ్గురం రేపు బయలుదేర వచ్చు'' పరమేశ్వర్ అన్నాడు.

విద్యాధర్ 'సరే' అన్నాడు.

★★★

ముందుగా అనుకున్నట్టుగానే అన్ని పనులు చేసేశారు ఇద్దరు చిన్న కొడుకులు. ఇంటిని అమ్మేసి మూడు భాగాలు చేశారు. మూడు ఎకరాల పొలం మూడు చోట్ల వుంది. 'నీకిది, నాకిది, అన్నయ్యకిది' అంటూ పంచేశాడు పరమేశ్వర్. మూడికి కౌలు కుదర్చడం కూడా పూర్తయింది. ఇంటి సామాన్లు ఒక్కొక్కటే పంచుకోసాగారు.

విద్యాధర్ అంతటినీ గమనిస్తూనే వున్నాడు. అతనికి తెలుసు తమ్ముళ్లు, వాళ్ల భార్యలు కలిసి అప్పటికే పంపకాలను అన్నీ సిద్ధంచేసి తనని అడిగారని. ఆ పంపకాలలో తనకు అన్యాయం చేస్తున్నారని అతనికి తెలుసు. తనకని ఇచ్చిన పొలంలో ఏదీ పండదని, తనకు చెప్పిన ఇంటి ధర అంత తక్కువగా వుండదని అన్నీ తెలుసు. అయినా అవన్నీ పట్టించుకునే స్థితిలో లేడతను.

తనకేనాడూ వాటిమీద ఆశలేదు. తను సంపాదిస్తున్నది తనకీ, తన భార్యాపిల్లలకి సరిపోతుంది. అంతవరకే చాలు. కానీ శారద ఊరుకుంటుందా? ఆలోచిస్తూ మౌనంగా ఉన్నాడు.

అప్పుడు గమనించాడతను తన తమ్ముళ్లు అన్నీ సమానమనే ముసుగులో లాభదాయకంగా పంచుకుంటున్నారు. అవసరాన్నిబట్టి ఇద్దరూ 'ఇది క్రితం ఏడాదొచ్చినప్పుడే నాన్న నాకిస్తానన్నాడ్రా' అని అబద్ధాలు కల్పించుకుంటూ పంచుకుంటున్నారు కానీ,

కానీ, ఆ గదిలో మూల వున్న 'ఒక్కటీ' వాళ్లు పట్టించుకోవడంలేదు. మర్చిపోయారా? విలువ కట్టలేని ఆ సంపదని ఎలా మర్చిపోగలరు? తమ తండ్రి ఎంత ప్రాణప్రదంగా చూసుకున్నాడు? ఏనాడూ వదలక ఎంతో ప్రేమతో తనకు తోడుగా నీడగా మరణించేటప్పుడు కూడా వుంచుకున్నది! ఈ ఇద్దరిలో ఎవరైనా తీసుకెళ్తారేమో? లేక తనకే వదిలేస్తారా? తనకు ఇచ్చేస్తే? అంత అదృష్టమా?

''అన్నీ పంచేసినట్లేగా అన్నయ్యా?'' పరమేశ్వర్ అడిగాడు.

సంశయంగా ఆలోచించాడు. మిగిలిపోయిన ఆ విలువైనది? అటు వైపు చూపిస్తూ ఏం చేద్దాం అన్నట్టు చూశాడు ఇద్దరు తమ్ముళ్లవైపు.

''నేను తీసుకెళ్లనన్నయ్యా. నాకెక్కడ కుదురుతుంది చెప్పు? చిన్నన్నయ్య తీసుకెళ్తాడేమో?''

''నేనా? మీ వదిన వద్దంటే వద్దంటోంది. నువ్వే తీసుకెళ్లాలి అన్నయ్యా. అందుకే మేం వదిలేశాం.''

'వదిలేశాం' ఎంత కఠినంగా అన్నాడు? వాళ్లకి విలువలు తెలియలేదేమో? ఏమైనా తనకే అంత అదృష్టం కలిగింది విద్యాధర్ అనుకున్నాడు.

ముగ్గురు కొడుకులు ఆ ఇంటిని వదిలి తమ తమ ఊర్లకి ప్రయాణమయ్యారు.

★★★

''శారద ఏమంటుందో?'' విద్యాధర్ అదే ఆలోచిస్తున్నాడు.

''ఈ రోజైనా డెలివరీ కావచ్చు. పల్లెటూర్లో ఎందుకు ఇబ్బంది పడతారని'' డాక్టర్ తీసుకెళ్లవద్దని చెప్పింది. లేకపోతే శారద తప్పకుండా వచ్చేది. ఇప్పుడు తన తోడికోడళ్లు తెలివిగా అన్నీ పంచేసుకున్నారని తెలిస్తే ఏమనుకుంటుందో? తనతో తీసుకెళ్తున్నవన్నీ ఎందుకూ పనికిరానివని తనకే తెలుసు. కానీ విలువ కట్టలేని ఆ ఒక్కటీ తన తమ్ముళ్లు తనకిచ్చిన బహుమతి అనుకుంటున్నాడు. శారద ఏమంటుంది? ఒప్పుకుంటుందా? సరళలా కాదంటుందా? ఏమో!

ఇల్లు చేరగానే పక్కింటి పిన్నిగారు వచ్చి తాళం ఇచ్చింది.

''శారదలేదు. హాస్పిటల్‌కు వెళ్తూ తాళాలు ఇచ్చివెళ్లింది'' చెప్పింది విద్యాధర్ పక్కనున్న విలువైనదాన్ని విచిత్రంగా చూస్తూ. అన్నీ ఇంట్లోకి చేర్చాడు. తన తండ్రి ప్రాణమనుకున్న ఆ ఒక్కటీ తన బెడ్రూమ్‌లో చేర్చాడు.

శారద వచ్చింది. రెండురోజుల్లో డెలివరీ కావచ్చునని డాక్టర్ చెప్పిందిట. శారదని కూర్చోమని చెప్పి జరిగిందంతా చెప్పాడు. పంపకాల్లో జరిగిన విషయాన్నంతా చెప్పాడు. ఆమె తేలిగ్గా తీసి పారేసింది. చివరగా తను ఓ విలువైన బహుమతి తెచ్చానని, తన తండ్రి ఎంతో ప్రేమగా చూసుకున్నదని చెప్పాడు.

''అక్కడ బెడ్‌రూమ్‌లో వుంది. వెళ్లు. ఇష్టం లేకపోతే చెప్పు. వేరే మార్గం ఆలోచిద్దాం.'' అన్నాడతను. శారద లేచి నవ్వుతూ–

''ఏంటో చెప్పొచ్చుకదా!'' అంటూ బెడ్‌రూంవైపు అడుగులేసింది.

'శారద కాదనదు, తన మనసు నాకు తెలుసు' విద్యాధర్ మనసులోనే అనుకున్నాడు. శారద వెనకాలే వెళ్లాడు.

బెడ్‌రూమ్ తలుపు తెరిచి స్థాణువులా నిలబడిపోయింది శారద. ఒక్క క్షణంలో తేరుకుని పరుగున పరుపు దగ్గరకు చేరుకుంది.

''అత్తయ్యా!'' అంటూ ఆమెను కౌగలించుకుంది.

విద్యాధర్ తృప్తిగా నిట్టూరుస్తూ అనుకున్నాడు

'నాకు తెలుసు శారద కాదనదు!'

★